# అటుకులు

ఉదయం పది గంటలు. ఎండ ఎర్రగా కాస్తోంది. పనుగుదాలు డన్ లప్ సోఫా మీద కూర్చుని కారపు అటుకులు కమ్మగా నములుతోంది.

పనుగుదాలు మేడమీద పడుతున్న సూర్య కిరణాలు పెంకుటిళ్ల మీద పడుతున్న సూర్య కిరణాలవంక గర్వంగా చూస్తున్నాయి. మేడమీది సూర్య కిరణాలను పెంకుటిళ్ల మీది సూర్య కిరణాలు ఈర్ష్యగా చూసూనే, పూరి గుడిసెల మీది సూర్యకిరణాలను చిన్న చూపు చూస్తున్నాయి.

పోతురాజు హడావిడిగావచ్చి పనుగుదాలు పక్కన కూర్చున్నాడు. పైన ఫేన్ గిరగిరా తిరుగుతోంది. కింద పనుగుదాలు అటుకుల్ని పరపరా నములుతోంది.

“పనుగుదాలూ, ఇవేళ సాయంత్రం మిల్లులు తనిఖీచేయడానికి డి.సి. టి.ఓ. వస్తున్నాడట. మన మిల్లులో బియ్యం బస్తాలు చాలా వుండిపోయాయి. ఏం చేద్దాం” అన్నాడు

పోతురాజు.

"బియ్యం బస్తాలన్నీ యిక్కడికి తోలించెయ్యి. నలుగురు మనుషుల్ని పెట్టు. మన రెండెడ్ల బండిని కట్టించు" అంది పనుగుదాలు గుప్పెడు అటుకులు నోట్లో పోసుకుంటూ.

"అలాగే" అని వచ్చినంత హడావుడిగానూ పోతురాజు వెళ్లిపోయాడు.

పనుగుదాలు చిరాగ్గా పైకి చూసింది. ఫేన్ ఆగిపోయింది. కరెంట్ పోయింది. ఉక్క. పీక పట్టుకుని నొక్కేస్తున్నట్టు ఊపిరి సలపనీయకుండా ఉక్క. పనుగుదాలు ఒంటి నిండా చెమటలు పట్టేశాయి. పైట చెంగుతో విసురుకుంది. గాలి అసలు రావడం లేదు. బయట నిప్పులు చెరుగుతూ ఎండ. పాడు ఎండ.

ప్లేటులోని అటుకులు శుభ్రంగా వూడ్చి, నోట్లో వేసుకుంది పనుగుదాలు. వంట గదిలోకి వెళ్లింది నెమ్మదిగా. ఆమెకు పనుగుదాలు పేరు పెట్టినందుకు —— యిప్పుడామెకు ముక్కుకు ముక్కెర పెట్టి, చెవులకు జూకాలూ, నడుముకు వడ్డాణం తగిలించి అమ్మవారి గుడిలో విగ్రహాన్ని తీసేసి, ఆమెను కూర్చోబెడితే అచ్చు పనుగుదాలమ్మ లాగానే వుంటుంది. ప్లేటు నిండా అటుకులు పోసుకుని, నెమ్మదిగా నడిచి మళ్లీ సోఫా మీద కూలబడింది. సోఫా అలవాటుగానే "అబ్బా" అని మూలిగింది.

అబ్బాయి మధు ఎలా చదువుతున్నాడో? పాపం, భోజనం వేళకు చేస్తున్నాడో, లేదో? డాక్టరు చదువుకోసం అంత దూరం పంపాల్సి వచ్చింది. ఇక్కడ డొనేషన్ కడదామనుకున్నా సీటు దొరికి చస్తేనా? మార్కులు మరీ తక్కువ వచ్చాయి. లేదు పొమ్మన్నారు. ఇక్కడ కాకపోతే యింకో చోటయినా సీటు దొరికిందా, లేదా? డబ్బు పోతేపోయింది.

మధు డాక్టరయి వచ్చాడంటే లక్షలకు లక్షలు వస్తాయి కట్నాలు! ఇక్కడే ప్రాక్టీసు పెట్టించాలి. ఆ తర్వాత, రెండు చేతులా వాడే సంపాదించుకుంటాడు, పోతే, పార్వతి దానికి పెళ్లి చేయాలి. "అబ్బే. అప్పుడే వద్దమ్మా. నా చదువయితేగానీ పెళ్లి చేసుకోను అంటుంది పార్వతి పెళ్లి పేరెత్తితే. ఏవిటో ఆడపిల్ల ఎంత చదివినా మొగుడికీ, పిల్లలకీ వండి పెట్టాల్సిందేకదా. పెద్ద ఉద్యోగస్తుడికిచ్చి పార్వతి పెళ్లి చెయ్యాలి. దానందం చూస్తే ఎవరైనా కళ్లకద్దుకుని చేసుకుంటారు, కట్నం మాత్రం తక్కువిస్తామా?

పనుగుదాలు జాకెట్టంతా తడిసిపోయింది. ఒళ్లంతా చెమటలు. ఆమెకు పరమ తిక్కగా వుంది. మరీ ఉక్కగా వుంది. కరెంటు వస్తే బావుండుననుకుంది.

ఇంటి గేటు ముందు బియ్యం బస్తాలతో బండి ఆగింది. బండిమీద వెంకన్న నిలబడి, క్రింద నిలబడ్డ సోములు భుజం మీదకు బస్తా అందించాడు. సోములు బియ్యం బస్తా లోపలికి మోస్తూ, "ఎక్కడెయ్యనండీ" అన్నాడు.

పనుగుదాలు తిక్కనీ, ఉక్కనీ పక్కకు నెట్టి "యిలా మోసుకురా" అని పెద్ద కొట్టుగది చూపింది. సోములు బస్తా ఆ గదిలో పడేసి, బండి దగ్గరకెళ్లాడు. మరో బస్తా తేవడానికి.

సోఫా మీద కూచుని, అటుకులు నోట్లో వేసుకోబోతూ పనుగుదాలు పైకి చూసింది, ఆమె ముఖం వికసించింది. పైన ఫేన్ నెమ్మదిగా తిరుగుతూ స్పీడందుకోబోతోంది. హమ్మయ్య, కరెంటు వచ్చిందనుకుంది. బయట ఒకటే ఎండ, నయమే, ఫేన్ తిరుగుతోంది.

ఏదో మాటమీద కామందన్నాడు తామందరితో "ఏవిటోరా, మీరంతా నేను సుఖపడి పోతున్నాననుకుంటారు, కానీ, మాకేమీ సుఖముండదు, సంతోషం వుండదు, డబ్బుకు కాపలా కాయడానికే పరిపోతుంది టైమంతా. తృప్తిగా నిద్ర కూడా వుండదు. మరి మీరో, హాయిగా కష్టపడతారు, కూల్డబ్బులు పట్టుకుపోతారు. తింటారు, తాగుతారు, సుఖంగా నిద్రపోతారు. చీకూ, చింతలు లేని బతుకులురా మీవి-" తోటి కూలీలందరూ నమ్మేరో లేదో కానీ. తానప్పుడు నమ్మింది. తర్వాతర్వాత తెలుసుకుంది డబ్బుతో ఎన్ని సుఖాలొస్తాయో!

చిత్రం. ఇప్పుడు ఏదైనా అవకాశం వస్తే తానూ ఆ మాటలే అంటుంది. కూలీలతో. వాళ్లు నమ్ముతున్నారో లేదో కానీ, నమ్ముతున్నట్టే కనిపిస్తున్నారు. నిజానికి డబ్బుతో తానెంతో సుఖపడింది. సుఖపడుతోంది. అయినా, వాళ్లు తన ఐశ్వర్యాన్ని చూసి 'ఏడుస్తారేమో' అన్న అనుమానంతో అలా అంటోంది.

ఒక తోవ ఆయిపోయినట్టుంది. బండెళ్లి పోయింది. పనుగుదాలు లేచి, వరండా మీద నడిచి కొట్టుగది దగ్గరకెళ్లింది. పది బస్తాలున్నాయి. మళ్లీ వెనక్కివచ్చి సోఫా మీద చతికిలబడింది.

"ఒసేవ్, పనుగుదాలూ, వచ్చే సినారం నీ పెళ్లే. పెంటయ్యకిత్తన్నాం. ఆడమ్మదానికున్న ఎండికడియాలూ, కాసులపేరూ నీకెడతానంది. మనువయినా, యించక్కా ఈ వూళ్లోనే వుండొచ్చు" అంది పనుగుదాలు తల్లి.

"అమ్మా, పెంటయ్యని చేసుకోనే" అందామనుకుంది పనుగుదాలు. కానీ అనలేక పోయింది.

పెంటయ్యకూ, పనుగుదాలుకూ పెళ్లయిపోయింది. పెంటయ్య

ముందు నలుగురు పుట్టి పోయారు (వైద్య సదుపాయం లేక). పెంటయ్య కడుపుతో వున్నప్పుడు వీడైనా బతుకుతాడో లేదోనని వాడి తల్లి తెగ భయపడిపోయింది. పెంటయ్య పుట్టగానే పెంటమీద దొర్లించారు. పెంటయ్య అని పేరు పెట్టారు. రెండు, మూడు సార్లు జబ్బు చేసినా బతికాడు (ఊళ్లోకి కొత్తగా వచ్చిన కుర్ర డాక్టరు మందులవల్ల).

పెంటయ్య చాలా అమాయకంగానే కాకుండా చాలా మోటుగా కూడా వుండేవాడు. అందరూ వాడిని ఏడిపించేవారు. దొరికితే పెంటయ్య వాళ్లను తన్నేవాడు.

పెళ్లయి ఆర్నెల్లయినా, పనుగుదాలుకు పెంటయ్య మీద ప్రేమ లాంటిదేమీ కలగలేదు. పగలు ఇద్దరూ కష్టబడి వచ్చేవారు. రాత్రప్పుడు, పెంటయ్యక్కావలసి వచ్చినప్పుడు శరీరాన్ని అప్పజెప్పేది.

ఆ బతుకు పనుగుదాలుకు చాలా నిస్సారంగా వుండేది పెంటయ్య ను చూస్తే చాలా చిరాగ్గా వుండేది. ఎప్పుడూ పెరిగిన గడ్డం. మాసిన గోచీ. ఎలాగైనా వీడి నుంచి తప్పించుకుంటే బావుండుననుకునేది.

నిజంగానే పనుగుదాలు అందంగా వుండేది. చామన ఛాయ. బలంగా పిట పిటలాడుతూ వుండేది. ఆడ పులికుండే అందం ఆమెది. ఆ వూరి మిల్లుకు తిండికి ధాన్యం ఆడించడానికెళ్ళినప్పుడల్లా మిల్లుడ్రైవరు పోతురాజుతో పారిపోతే బావుండుననుకునేది. వాడు పెద్ద హీరోలా కనిపించేవాడు ఎప్పుడూ నిక్కరూ, బుష్‌కోటూ, నోట్లో బీడి, చాలా స్టయి లుగా కనిపించేవాడు. హాస్యాలాడేవాడు. తనకి ధైర్యం సరిపోయేదికాదు.

గేటుముందు బండాగింది పనుగుదాలు ఆలోచనల్ని ఆపుజేసింది. బియ్యం బస్తాలొక్కొక్కటే కొట్టుగదిలో పడేస్తున్నాడు సోములు. "ఒరేయ్ త్వరగా పడేయ్యండ్రా. నెమ్మదిగా నిక్కి నీలుగుతూ పన్చేస్తే ఎలాగా?

పొద్దుకూకేటప్పటికి కూలిచ్చేమని గొడవచేస్తారు. పనిచూస్తే నానుస్తూ చేస్తారు" అని అరిచింది పనుగుదాలు. సోములు పెదాలు కదిలేయి కానీ మాటలు బయటకు రాలేదు. పనుగుదాలు వెనక్కి జారబడి కొంచెం సేపు కళ్ళు మూసుకుని తెరిచింది. గుప్పెడు అటుకులు నోట్లో వేసుకుంది. కొట్టుగది దగ్గరకెళ్ళి ఎన్ని బస్తాలేశారో లెక్కచూసి వచ్చింది. బండెళ్ళి పోయింది మిల్లుకి.

పనుగుదాలిని ఆలోచనలు చుట్టుముట్టాయి. ఆమెకి ఆలోచించడానికి యిష్టం లేకపోయింది. చాలాసార్లు ఆ సంఘటన యిష్టంలేకపోయినా తలచుకుంటూనే వుంది. అవును. పెంటయ్య ఆ రోజలా చెయ్యకపోతే తనకీ అదృష్టం ఏదీ? వాడెలా ప్రవర్తించినా తనకు మంచే జరిగింది. వాడలా ప్రవర్తించి వుండకపోతే తను కూలిపనికెళ్తూ పెంటయ్యతోనే నిస్సారంగా బతికుండేదేమో?

ఆ రోజున ఆ ఊళ్ళో పనుగుదాలమ్మ సంబరం జోరుగా జరుగుతోంది. రాత్రి పదకొండు గంటలయింది. పనుగుదాలు, యింకా చాలా మంది వాళ్ళ గుడిసెలముందు నిలబడి సంబరాన్ని చూస్తున్నారు.

ముందుగా కోయడాన్సు వచ్చింది. వికృతంగా రంగులు పూసుకుని డాన్సు చేస్తున్నారు. ఇద్దరూ మగాళ్ళే అయినా, ఒకడు లంగాకట్టి జాకెట్టు తొడిగేడు. డాన్సు చేస్తూ పచ్చిబూతులు పాడుతున్నారు, చూస్తున్న వాళ్ళందరూ పగలబడి నవ్వుతున్నారు.

కోయడాన్సు వెళ్ళిపోయింది. బ్యాండు వచ్చింది. సినిమా పాటొకటి వినిపించి, అదీ వెళ్ళిపోయింది. గారడీ వచ్చింది సారా వాసన గుప్పుమంది, వాళ్ళు తాగిన మైకంలో మంచి హుషారుగా డప్పుల మోతకి అనుగుణంగా ఎగురుతున్నారు, పనుగుదాలుకి కూడా ఎగరాలనిపించింది.

గారడీ వెళ్ళిపోయింది. భోగం మేళం వచ్చింది. పనుగుదాలు దృష్టి అంతా వాళ్ళ చీరలమీదా. నగలమీదా (రోల్డుగోల్డువని తెలీదు) పడింది. తనకూ్కడా అంత మంచి చీరలుంటె ఎంతబావుండుననిపించింది. తర్వాత గరగలొచ్చాయి. మాదిగ డప్పులు గట్టిగా వాయిస్తున్నారు. వాటికి తగ్గట్టుగా గరగలను ఎత్తుకుని ఎగురుతున్నారు.

పనుగుదాలు తన గుడిసెలోకి వెళ్ళిపోయింది. మంచం మీద పడుకుంది. నిద్ర రావటంలేదు. బాగా డబ్బు ఎలా సంపాదించాలా అనే ఆలోచన గుండుసూదితో గుచ్చినట్లుగా మెదడుని గుచ్చుతోంది. ఆమె కళ్ళ ముందు రకరకాల రంగుచీరలూ. నగలూ, పిండివంటలూ కదులుతున్నాయి. అందరూ ఈ రోజు ఎంతో హుషారుగా వున్నారు. రేపు రకరకాల పిండి వంటలు చేసుకుంటారు. ఎంతో ఖరీదైన చీరలుకట్టుకుంటారు. తనకేవీ? ఏంలేవు. తనకూ్కడా బోలెడు డబ్బుంటే? అవును తల్లీ అవును. నాకూ్కడా బోల్డు డబ్బుంటే...ఉంటాయుంటాయి. అవన్నీ నాకూ వుంటాయి.

గుడిసెమీద టపటపమని చినుకుల చప్పుడు, జోరునగాలి. జివ్వున చలి. గుడిసెకున్న తలుపు అటూ యిటూ వూగుతూ దబదబమని శబ్దం చేస్తోంది.

చినుకులు ఎకు్కవై వర్షం పెద్దదయింది. పనుగుదాలు మంచం మీంచి లేచి గుమ్మం దగ్గరకొచ్చింది నిలబడిబయటకు చూసింది. వర్షపు జల్లు మీద పడుతోంది. చుట్టూ చీకటి చిక్కగా వుంది. ఆకాశం భోరున ఏడుస్తొంది. వర్షం జోరున కురుస్తోంది. గాలిహోరున వీస్తోంది. ఒంటరిగా వున్నందుకు పనుగుదాలుకు భయంగా వుంది. ప్రతిరోజు పెంటయ్య

ఎనిమిది గంటలకే మంచం ఎక్కేసేవాడు. ఈవేళ యింత రాత్రియినా యింకా రాలేదు. ఎంత జాతర సరదా అయితే మాత్రం..., ఎన్నడూ లేనిది ఆ సమయంలో పెంటయ్యా త్వరగా వచ్చేస్తే బావుండు ననుకుంది పనుగుదాలు.

చీకటి అంతకంతకూ చిక్కనవుతోంది. గాలిఅంతకంతకూ ఎక్కువ అవుతోంది. వర్షం అంతకంతకూ పెద్దదవుతోంది. గుడిసె చుట్టూ నీరు చెరువులావుంది. చినుకుల చప్పుడు వినడానికి చికాగ్గావుంది. జల్లుమీద పడడంవలనా, గాలి బాగా వీస్తుండడంవలనా చలిచలిగావుంది. పనుగుదాలు తలుపు దగ్గరకేసి, భయం భయంగా దిగులు దిగులుగా నెమ్మది నెమ్మదిగా వెనక్కి మళ్ళి, మంచంమీద పడుకుంది. కిరసనాయిలు దీపంగాలికి రెపరెప లాడుతోంది. ఆరిపోవడానికి సిద్ధంగా వుంది.

తలుపు తీసుకుని తూలుతూ పెంటయ్యా గుడిసెలోపలికొచ్చాడు. ఏదోపాట పాడుతూ పనుగుదాల్ని పిలిచాడు. సారా వాసన, పనుగుదాలు విసుక్కుంటూ వాడి తల తుడిచింది. మంచంమీద పడుకున్నాడు.

పనుగుదాలు ఆశ్చర్యంగా పెంటయ్యాని చూసింది యింతకుముందు ఎప్పుడైనా తాగేవాడేమోకానీ పెళ్ళయిం తర్వాత పెంటయ్యా తాగడం ఆమె చూడలేదు. వెర్రోడికి తాగుడుకూడా కావలసివచ్చిందా అనుకుంది. పెంటయ్యా రావడంతో ఒంటరితనం పోయింది. మంచంమీద పెంటయ్యా ప్రక్కన పడుకుంది పనుగుదాలు. వర్షం యింకా యెక్కువైనట్టు చినుకుల శబ్దం చెబుతోంది, గాలియింకా గట్టిగా వీస్తున్నట్టు నిదర్శనంగా దీపం ఆరిపోయింది.

పెంటయ్య పనుగుదాలును గట్టిగా వాటేసుకున్నాడు. ఆమె అతని కింకా దగ్గరగా జరిగింది. జాకెట్టు విప్పేడు. పనుగుదాలు అభ్యంతరం చెప్పలేదు సారా వాసన భరిస్తోంది. రొమ్ము నోట్లో పెట్టుకున్నాడు. పనుగుదాలు కళ్ళు మూసుకుంది.

అంతే పనుగుదాలు గట్టిగా అరిచింది. దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది. పెంటయ్యాని గట్టిగా గెంటింది. అతని ముఖం ఆమె తొడమీద పడింది. పనుగుదాలు మళ్ళీ గట్టిగా అరిచింది. పెంటయ్యాని బలంగా తోసింది. పరుగెట్టింది. తలుపు తీసుకుని పరుగెట్టింది. చీకటిలోకి పరుగెట్టింది ఆమెతో చీకటి పరుగెట్టింది. కేకలేస్తూ ఏడుస్తూ పనుగుదాలు పరుగెట్టింది. వర్షం. వర్షం మోకాళ్ళవరకూ నీరు నేలంతా బురద బురద. సముద్రంలా నీరు. విషప్పాముల్లా చినుకులు చినుకులు. భయంకరంగా బాధలా చీకటి చీకటి కారుచీకటి. పనుగుదాలు 'అమ్మాఅమ్మా' అంటూ నడుస్తోంది. పడుతోంది. లేస్తోంది, పరుగెడుతోంది.

అఖరికి ఎంతో శ్రమతో పనుగుదాలు తల్లిని చేరుకుంది. 'అమ్మా' అంటూ తల్లిని కౌగిలించుకుంది. దీపం వెలుగులో పనుగుదాలుని తల్లి చూసింది. పనుగుదాలు రొమ్ము సగం తెగి రక్తం రక్తం కాట్లు పళ్ళకాట్లు తొడమీద ముక్కపూడి రక్తం బొట్లు బొట బొటా కారుతూ. తల్లికి అర్థం అయింది. తల్లి మనసు విలవిల లాడిపోయింది. కూతురితో పాటు తల్లి ఏడ్చింది.

వర్షం వెలిసింది తెల్లవారింది. కులపెద్ద దగ్గరకెళ్ళారు. పెంటయ్యకు యాభైరూపాయలుతప్పుకింద జరిమానా విధించాడు. పెంటయ్యతో తానిక సంసారం చెయ్యనంది పనుగుదాలు వాడితో విడిపోయింది. చాలా రోజులవరకూ మామూలు మనిషి కాలేక పోయింది. సిగ్గుతో సరిగా తిరగ లేక పోయింది.

పనుగుదాలు భారంగా నిట్టూర్చింది. పైన ఫేన్ గిరగిరా తిరుగు తున్నా ఆమె ఒంటినిండా చెమటలు పట్టేశాయి. ఆలోచన్లకుఅడ్డువేసింది. గేటుదగ్గర బండాగింది సోములు బియ్యం బస్తా మోసుకువస్తున్నాడు. పనుగుదాలు గుప్పెడు అటుకులు నోట్లో వేసుకుంది. గోడగడియారం వంక చూసింది. మూడుగంటలయింది. యింకెంతో సైములేదు. తనికీకి డి.సి. టి.ఒ. వచ్చేస్తాడో ఏంటో?

"ఏరా త్వరగా మొయ్యి నువ్వాలీసెంచేస్తే యిక్కడ మా కొంప లంటుకుంటాయి" అని సోములుకి చివాట్లేసి, కొట్టుగదిదగ్గరకి నడిచింది, పనుగుదాలు. "బస్తాలిలాగే నేట్రా సర్దటం" అని ఒక కసురుకసిరి, తను పేర్చిన బస్తాలపై కెక్కి సర్దసాగింది, మళ్ళీ ఆలోచనలు ఆమెను చుట్టు ముట్టాయి.

పనుగుదాలు పన్లోకెళ్ళి మిల్లుముందు నుంచిపచ్చేటప్పుడల్లా పోతు రాజు పోజులు కొట్టేవాడు. పనుగుదాలు వలపులచూపులతూపులు విసిరేది. అప్పుడప్పుడూ సంకేతస్థలాల్లో కలుసుకుసేవారు. ఊళ్ళోవాళ్ళకి తెలిసింది. ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు.

తర్వాత పనుగుదాలు కూలిపని కెళ్ళడం మానేసింది. మిల్లులో పోతురాజుతో తనూ పనికి కుదిరింది. బియ్యం ఆడించుకున్న వాళ్ళ బియ్యాన్నిబట్టి యిద్దరికీ చెరొకచేటలోనూ బియ్యం పెట్టేవారు పక్కనే అటుకులు ఆడే మిల్లుండడంవల్ల అటుకులు ఆడినప్పుడు అటుకులువచ్చేవి. రోజుకి కనీసం చెరొక కుంచెడు బియ్యం వచ్చేవి. రెండు నెలలుగడిచాయి పనుగుదాలు రెండు గేదెల్ని కొంది. పాలుఅమ్మేది. మజ్జిగఅమ్మేది. యిలా వుండగా ఒకనాడు పనుగుదాలుకి ఓ చక్కని ఆలోచనవచ్చింది. పోతు రాజుతో చెప్పింది. ముందు అనుమానించినా తర్వాత ఒప్పుకున్న కార్య

రూపంలో పెట్టేడు. రోజూ మామూలుగా వచ్చే బియ్యం కాక మరో రెండు కుంచాలెక్కువ వచ్చేవి. అందులోని కిటుకంతా అల్లరు చెక్కులు వంచ దంలోనే వుంది.

పనుగుదాలు అమరకం పొలాలు చేసుకునే సన్నకారు రైతులకు అప్పులిచ్చేది. అప్పుగా ముప్పై రూపాయలిస్తే, పంటలొచ్చేక బస్తాధాన్యం యివ్వాలి. చాలామంది పనుగుదాలు దగ్గర అప్పు చేసేవారు. పంటలొచ్చేక ధాన్యం యిచ్చేవారు. ధాన్యం నిలవేసేది. ధర బాగా వచ్చేక అమ్మేది. బస్తా అరవైకీ డెబ్బైకీ అమ్మేది. పనుగుదాలుకి కొంచెం పేరొచ్చింది. అందరూ (అప్పు అవసరమైన వాళ్ళందరూ) ఆమె చుట్టూ తిరిగేవారు.

నెలలు గడుస్తున్నాయి. పనుగుదాలు ఒళ్ళోకి వందలు వందలొస్తున్నాయి వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతొంది. వందలు వేలవుతున్నాయి. పనుగుదాలుకి కొంచెం ఒళ్ళు పెరిగింది.

ఆ పల్లెటూరికి దగ్గర్లోనేవున్న పట్నమూ పల్లెకాని వూరిలో నెంబరు మిల్లు అమ్మకాని కొచ్చినట్లు తెల్సింది. మిల్లు యజమాని దివాళా తీసి అమ్మేస్తున్నాడు. పోతురాజుని తీసుకుని పనుగుదాలు మిల్లు యజమానిని కలుసుకుంది. అతను చెప్పిన ధరకు పనుగుదాలు బేరమాడితే తగ్గేడు. అయితే ఆ ధర కూడా నాలుగువేలు తక్కువయ్యాయి. పోతురాజుని బయటకు వెళ్ళమని చెప్పి, పనుగుదాలు వలపుల చూపుల తూపులు విసిరింది

ఎలాగైతేనేం బేరం కుదిరింది. నెంబరు మిల్లు పనుగుదాలు పరం అయింది. నెంబరు మిల్లుకి డిమాండ్ పెరిగింది. ప్రక్కటూళ్ళ నుంచి కూడా చిల్లర ధాన్యం వచ్చేవి. బియ్యం ధాన్యానికి సగానికి సగం రావడంవలనా, నూకలసలు రాకపోవడం వలనా అందరూ అక్కడికే తెచ్చే

వారు. పనుగుదాలు మిల్లు మేనేజ్ చేసేది. పోతురాజు చౌకగా ధాన్యం కొని, ఆడించి, ఎక్కువ ధర కమ్మేవాడు.

పనుగుదాలు డబ్బు సంపాదించడానికి కొన్ని సూత్రాలు అమలు పర్చింది. అమలు పరుస్తోంది. డబ్బు సంపాదించాలంటే తెలివితేటలే కాకుండా అవినీతి, అన్యాయాలు కూడా బాగా కావాలి. మనం డబ్బు నీతిగా సంపాదించినా (అసలు నీతిగా సంపాదించలేం) అవినీతిగా సంపాదించినా డబ్బు డబ్బే. అవసరం వచ్చినప్పుడు తన వాళ్ళు అనీ, తన శరీరం అనీ మూర్ఖంగా పట్టుకూర్చోకూడదు. పనుగుదాలు స్టేటస్ పెరిగింది. చదవడం రాయడం నేర్చుకుంది. ఉన్న తెలివితేటలకు మెరుగులు పెట్టింది

గోడ గడియారం నాలుగు గంటలు కొట్టింది. పనుగుదాలు ఆలోచనల నుంచి బయటపడింది. ఒంటినిండా దూగర అంటుకుంది. చమటలు ధారగా కారుతున్నాయి. పనుగుదాలు బియ్యం బస్తాలు సర్దుతోంది. హడావిడిగా సర్దుతుంది. సోముల్ని బియ్యం బస్తాలు వేగంగా మోసుకుని రమ్మని కేకలేస్తోంది. సోములు చమటలు కక్కుకుంటూ సణుగుకుంటూ బస్తాలు మోసుకొస్తున్నాడు. పనుగుదాలు సర్దుతోంది. ఆమెకి తొందర తొందరగా వుంది. డి.సి.టీ.ఓ. వచ్చేస్తాడేమో !

"ఒరే సోములూ, బండి ముందు కాపలావున్నోడిని కూడా బస్తాలు మోసుకురమ్మను. బండెక్కడికీ పోదులే" అంది పనుగుదాలు చిరాకు పడుతూ.

వెంకన్నా, సోములూ బస్తాలు మోసుకొస్తున్నారు. పనుగుదాలు

సర్దుతోంది. పార్వతి యింకా కాలేజి నుంచి రాలేదేం చెప్మా! దీనికి పెత్తనాలు ఎక్కువైనాయి. పెళ్ళి కావలసిన పిల్ల తనిష్టం వచ్చినట్టు తిరిగితే పరువేంకాను;

సోములు భుజం మీది బస్తా పైకేసేడు. బియ్యం బస్తాని పనుగుదాలు అందుకుంది. కానీ, ఆమె చేతుల్లోంచి బస్తా జారిపోయింది. దానితో పాటు చివరనున్న మరో రెండు బస్తాలు కూడా జారిపోయాయి. సోములు దబుక్కున వెనక్కి వెల్లకితలా పడిపోయాడు అతని ఛాతీమీదా తలమీదా కాళ్ళమీదా బస్తాలు పడిపోయాయి. సోములు 'అమ్మా' అని ఒక్కసారే మూలిగాడు. పనుగుదాలు గబగబ పేర్చిన బస్తాల మీంచి కిందకు దిగింది. బియ్యం బస్తా భుజాన్నుంచుకుని నిలబడ్డ వెంకన్న బస్తా క్రింద పడేసి, సోములు మీద పడిపోయిన బస్తాల్ని తియ్యసాగేడు పనుగుదాలు వాడికి సాయంచేసింది సోముల్ని లేవదీయబోయారు. సోములు లేవలేదు. పనుగుదాలు అనుమానంగా వాడి గుండెమీద చెయ్యేసి చూసింది. గుండె కొట్టుకోవడంలేదు. పనుగుదాలు గుండె గిలగిలలాడింది. ఆమె ముఖం నిండా మరింత చెమటలు పట్టేసేయి.

"మమ్మీ, కాఫీ" అంటూ పార్వతి పుస్తకాలు పట్టుకొని తిన్నగా అక్కడికి వచ్చింది పనుగుదాలు తేరుకుని "పార్వతి, మీ నాన్నని పిల్చుకురా. రిక్షా యింకా గేటు దగ్గరుంటే దానిమీదెళ్ళు అంది" పార్వతి నేల మీద పడివున్న సోముల్నీ, బిత్తరపోయి చూస్తున్న వెంకన్ననీ, తల్లినీ ఆశ్చర్యంగా చూసి వెళ్ళిపోయింది.

"ఒరే వెంకన్నా, ఎవరడిగినా సోములు భుజంమీది బస్తా పైకెయ్యబోతూ జార్చుకున్నాడనీ, అది వాడిమీద పడిపోయిందని చెప్పు, ఇదిగో ఈ పదిరూపాయలు వుంచు. రేపు నీకు వంద రూపాలిస్తాను.

ముందు ఈ బియ్యం బస్తాలన్నీ పై కేసెయ్. ఒక్క బస్తా మాత్రం కింద వుంచు" అంది.

వెంకన్నకు ఆలోచించడానికి వ్యవధి లేకపోయింది. ఇద్దరూ బస్తాలన్నీ సర్దేశారు. ఒక బస్తా మాత్రం సోములు ప్రక్కనుండి పోయింది.

పోతురాజు వచ్చేడు. చూసేడు. రిక్షామీద సోముల్ని పడేశారు. వెంకన్ననికూడా సోములింటికి పంపేరు. పనుగుదాలుకి దూగరతోనూ చెమటతోనూ పరమ చికాగ్గా వుంది. స్నానం చెయ్యడానికి లోపలికెల్లింది. ఆమె బట్టలేసుకుని వచ్చేటప్పటికి సోములు తాలూకు వాళ్ళు చాలామంది వచ్చేరు. ఎందుకొచ్చేరన్నట్టు పనుగుదాలు వాళ్ళ వంక చూసింది.

"మీదగ్గర పనిసేత్తుండగా సోములు చచ్చిపోనాడు. ఇప్పుడాడి కుటుంబం దిక్కులేనిదయింది. కుటుంబానికంతా ఆడే ఆధారం. ఆళ్ళందరూ ఎట్టా బతుకుతారు" అన్నాడొకడు.

'నిజమే. మాదగ్గర పన్చేస్తూ చచ్చిపోయాడు. అదీ బియ్యం బస్తా జార్చుకుని చావుతెచ్చుకున్నాడు. దానికి మేం ఏం చేస్తాం" అంది పనుగుదాలు సోఫాకి జారబడి.

"మీరలాగంటే మేం పోలీసు కేసెడతాం. తర్వాత మీయిట్టం. ఆడి పెళ్ళానికి తవరు ఒక ఎకరం బూమి రాయించాల. అది నేయం."

"ఇంకా నయం. నా ఆస్తంతా రాపిచ్చేమనలేదు. వాడి కుటుంబం దిక్కులేనిదయింది. కాబట్టి ఓ వెయ్యి రూపాయలిస్తాను. అదీ జాలిపడి."

"వెయ్యేవరిక్కావాల. ఎకరం భూమి రాయాల్పిందే" అందరూ ఒక్కసారిగా.

"లాభంలేదు. మీరేడుస్తున్నారు కాబట్టి రెండు వేలిస్తాను. మీకిష్ట మైతే తీసుకోండి. లేకపోతే మీ యిష్టం వచ్చింది మీరు చేసుకోండి. నా దగ్గర మీ బెదిరింపులేం పన్జెయ్యవు. ముందిక్కడనుంచి వెళ్ళిపొండి" అంది పనుగుదాలు విసుగ్గా, కోపంగా.

వచ్చినవాళ్ళు తిట్టుకుంటూ ఆలోచించుకుంటూ శోకాలెడుతూ వెళ్ళి పోయారు. పనుగుదాలు కొంచెం సేపు పోయిన తర్వాత వెంకన్నని రమ్మని కబురంపింది. వెంకన్న కనిపించలేదని వెళ్ళినవారు తిరిగివచ్చారు. పనుగుదాలు ఆలోచించింది. కళ్ళు ఎర్రబడ్డాయి. ఒళ్ళు మండిపోయింది. కనుబొమలు ముడిపడ్డాయి. పోతురాజుని పిల్చింది. చెప్పింది. "సరే" నంటూ పోతురాజు పోలీసు స్టేషన్‌కి నడిచాడు.

* * *

పనుగుదాలు మీద కేసు నడిచిందా?

నడిచిందండి.

వెంకన్న సాక్ష్యం ఎవరివైపు చెప్పాడు.

పాపం సోములువైపే చెప్పాడు. నిజాన్నే చెప్పాడు.

పనుగుదాలుకి శిక్ష పడిందా?

పడలేదు కేసు కొట్టేసేరు.

అదెలా సాధ్యం?

నిజం నిప్పులాంటిదనీ, రూపాయినోట్ల వర్షం కురిపిస్తే చప్పగా చల్లారి పోతుందనీ పనుగుదాలుకి బాగా తెలిసినప్పుడు, ఎందుకు సాధ్యం కాదు?

కేసెలా పోయిందో ఆ వివరాలు ఎవరికైనా తెలుసా?

సోములు శవాన్ని పోస్టుమార్టమ్ చేసి, అతనికి గుండె జబ్బుందనీ అస్తూపడడంతో గుండాగి చచ్చిపోయాడనీ రిపోర్టిచ్చిన గవర్నమెంటు డాక్టర్‌కీ, తెలివిగా పరిశోధించిన సబ్‌యిన్‌స్పెక్టర్‌కీ, పనుగుదాలు నుంచి పారిపోయిన రెండువేల రూపాయనోట్లకీ, ఆమె తరుపున వాదించిన ప్లీడర్‌కీ తప్ప కేసు వివరాలు మరెవరికీ వివరంగా తెలీదు,

సోములు పెళ్ళాం ఏం చేస్తోంది?

కేసుపోయినందుకు ఏడవడంలేదు. రెండువేలూ తీసుకోనందుకూ ఏడవడంలేదు. సోములు చచ్చిపోయినందుకు రాత్రీ పగలూ తెగఏడుస్తోంది.

సరే పనుగుదాలు యిప్పుడు ఏంచేస్తోంది?

పైన ఫేన్ గిరగిరా తిరుగుతుండగా, సోఫా మీదకూర్చుని గుప్పెడు అటుకులు నోట్లో పోసుకుని నములుతూ, తన అవసరానికీ అభివృద్ధికీ అటుకుల్లాగే మనుషుల్ని కూడా నమిలేసే ధైర్యమూ నేర్పూ తనకున్నా యనుకుంటూ గర్వంగా నవ్వుకుంటోంది.

ఇంతకీ తనిఖీకి డి.సి.టి ఓ వచ్చాడా?

ఇంకా రాలేదు సార్!

(ఆంధ్రజ్యోతి, 25-7-75)